https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 39 మంగళవారం 2-06-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## సుప్రీంకోర్టుకు ఐదుగురు
# కొత్త జడ్జీలు...

**కొలీజియం సిఫార్సులకు ఆమోదం**



**న్యూఢిల్లీ, జూన్ 1**

దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తులను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సోమవారం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని కొలీజియం ఇటీవల సిఫార్సు చేసిన పేర్లకు కేంద్రం ఆమోదం తెలపడంతో ఈ నియామకాలు ఖరారయ్యాయి. కొత్తగా నియమితులైన వారిలో సీనియర్ న్యాయవాది వి మోహన, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, జస్టిస్ షీల్ నాగు, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్, జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. వీరి నియామకాలతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య మరింత బలపడనుంది. న్యాయవ్యవస్థలో అనుభవజ్ఞులైన వ్యక్తులకు అవకాశం కల్పించడం ద్వారా న్యాయపరమైన వ్యవహారాల పరిష్కారానికి మరింత వేగం చేకూరుతుందని భావిస్తున్నారు. ఈ జాబితాలో వి మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాదిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె 1988లో కోయంబత్తూరు న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల న్యాయ విద్యా కోర్సులో తొలి బ్యాచ్ విద్యార్థిగా చదువు పూర్తి చేశారు. అనంతరం ప్రముఖ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్ వద్ద జూనియర్‌గా పనిచేసి విశేష అనుభవాన్ని సంపాదించారు. 1996లో అడ్వకేట్ ఆన్ రికార్డ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా న్యాయవాద వృత్తిని కొనసాగించారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో కపిల్ సిబల్, కేకే వేణుగోపాల్, పి చిదంబరం, అరుణ్ జైట్లీ, అంధ్యార్జున వంటి ప్రముఖ న్యాయవాదులతో కలిసి అనేక కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. 2015 ఏప్రిల్ 23న ఆమెకు సీనియర్ న్యాయవాది హోదా లభించింది. వి మోహన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడంతో మహిళా న్యాయమూర్తుల ప్రాతినిధ్యం మరింత బలోపేతమైంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో మహిళా జడ్జిల సంఖ్య రెండుకు చేరింది. న్యాయవ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్న సంకేతంగా ఈ పరిణామాన్ని న్యాయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కొత్త న్యాయమూర్తుల నియామకాలతో సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల పరిష్కార ప్రక్రియకు ఊతం లభించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో విభిన్న అనుభవాలు కలిగిన న్యాయమూర్తులు చేరడం వల్ల న్యాయ పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# ప్రతి గింజా
# కొనుగోలు చేస్తాం..

**- రైతులకు సీఎం భరోసా - ధాన్యం కొనుగోలుపై స్పష్టత - తుమ్మిడిహెట్టిపై కేంద్రానికి విజ్ఞప్తి**



**కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 1**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తడిసిన ధాన్యానికి కూడా కనీస మద్దతు ధర అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి విమర్శించారు. కేవలం మద్దతు ధర ప్రకటించడం సరిపోదని, రాష్ట్రాల్లో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం కూడా కేంద్రం బాధ్యత అని అన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇచ్చే ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయనున్నామని తెలిపారు. రైతులు అధైర్యపడవద్దని, కొనుగోలు ప్రక్రియలో రెండు రోజులు ఆలస్యం జరిగినా ప్రతి గింజను కొనుగోలు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పండిన మొక్కజొన్న, జొన్నలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను కూడా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఏడాది కాలంగా చర్చలకు ప్రయత్నిస్తున్నప్పటికీ స్పందన రావడం లేదని అన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. మహారాష్ట్రతో సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోందని సీఎం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో మధ్యవర్తిత్వం వహించి పరిష్కారానికి దోహదపడాలని కోరారు. తెలంగాణ పట్ల వివక్ష కొనసాగితే తదుపరి కార్యాచరణను జూన్ 15 తర్వాత ప్రకటిస్తామని హెచ్చరించారు. సభలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని గూడాలు, తండాల్లో గుడిసెలు లేకుండా చేయడమే లక్ష్యమని చెప్పారు. ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, రెండో విడతగా మరో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, వివేక్ వెంకటస్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# బెంగాల్‌లో
# మంత్రివర్గ విస్తరణ

**- ముప్పై ఐదుగురికి అవకాశం - లోక్ భవన్ కార్యక్రమం - మరో విస్తరణకు అవకాశం**



**కోల్‌కతా, జూన్ 1**

పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన సువేందు అధికారి నాయకత్వంలోని ప్రభుత్వం తాజాగా మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం ముప్పై ఐదుగురు భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. గవర్నర్ ఆర్ ఎన్ రవి నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టనున్న ఈ మంత్రులు తమ పదవీ బాధ్యతలను త్వరలో స్వీకరించనున్నారు. మంత్రివర్గ విస్తరణ ద్వారా పాలనలో మరింత వేగం తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ నూట అరవై నాలుగు ఉపనిబంధన ఒకటి ప్రకారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంలో మొత్తం నలభై నాలుగు మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా ముప్పై ఐదుగురికి చోటు కల్పించడంతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రివర్గ సభ్యుల సంఖ్య నలభై ఒకటికి చేరింది. దీంతో ఇంకా ముగ్గురు సభ్యులకు అవకాశం మిగిలి ఉండటంతో భవిష్యత్తులో మరోసారి మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత నెల తొమ్మిదో తేదీన సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, నిశిత్ ప్రణామిక్, అశోక్ కీర్తనియా, క్షుదిరామ్ టూడు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇప్పుడు జరిగిన విస్తరణతో ప్రభుత్వానికి మరింత విస్తృతమైన మంత్రివర్గ బలం లభించింది. తాజాగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో దీపక్ బర్మాన్, తపాస్ రాయ్, శంకర్ ఘోష్, మనోజ్ కుమార్ ఒరావోన్, గౌరీ శంకర్ ఘోష్, స్వపన్ దాస్ గుప్తా, కల్యాణ్ చక్రవర్తి, అరుప్ కుమార్ దాస్, దూద్ కుమార్ మోండల్, శరద్వాత్ ముఖర్జీ, జగన్నాథ్ చట్టోపాధ్యాయ్, అర్జున్ సింగ్, మాలతీ రావా రాయ్, రాజేష్ మహతా, ఇంద్రాని ఖాన్, కౌశిక్ చౌదరి, గార్గి దాస్ ఘోష్, భాస్కర్ భట్టాచార్య ఉన్నారు.

# స్వనిధితో
# వ్యాపారాభివృద్ధి..

**- చిరు వ్యాపారులకు అండ - డిజిటల్ చెల్లింపుల విప్లవం**




**న్యూఢిల్లీ, జూన్ 1**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం దేశవ్యాప్తంగా చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఎలాంటి హామీ అవసరం లేకుండా రుణాలు అందించడం ద్వారా ఈ పథకం లక్షలాది కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చింది. 2020లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 1.12 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. దేశంలోని నగరాలు, పట్టణాల్లో నివసించే 75 లక్షలకుపైగా లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 17 వేల 800 కోట్ల రూపాయలకు పైగా రుణాలు పంపిణీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పథకానికి వస్తున్న విశేష ఆదరణను దృష్టిలో ఉంచుకుని దీనిని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ 2030 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. చిన్న వ్యాపారులకు ఆర్థికంగా బలాన్నివ్వడంతో పాటు స్వయం ఉపాధిని ప్రోత్సహించే దిశగా ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. పీఎం స్వనిధి పథకం డిజిటల్ లావాదేవీల విస్తరణలో కూడా విశేష ఫలితాలు సాధించింది. దేశవ్యాప్తంగా 55 లక్షలకుపైగా లబ్ధిదారులు డిజిటల్ వేదికలతో అనుసంధానమయ్యారు. వీరు కలిపి 841 కోట్లకు పైగా డిజిటల్ లావాదేవీలు నిర్వహించగా, వాటి మొత్తం విలువ 8.96 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు అందించిన నగదు ప్రోత్సాహకాలు, వడ్డీ రాయితీల రూపంలో లబ్ధిదారులకు సుమారు 800 కోట్ల రూపాయల ప్రయోజనం లభించింది. ఈ పథకం కింద మూడు దశల్లో ఎలాంటి గ్యారెంటీ లేకుండా 15 వేల రూపాయలు, 25 వేల రూపాయలు, 50 వేల రూపాయల వరకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలు అందిస్తున్నారు. రెండో దశ రుణాన్ని విజయవంతంగా చెల్లించిన వ్యాపారులకు 30 వేల రూపాయల పరిమితితో యూపీఐ అనుసంధానిత రూపే క్రెడిట్ కార్డు అందిస్తున్నారు. అలాగే స్వనిధి సే సమృద్ధి కార్యక్రమం ద్వారా లబ్ధిదారులను పలు కేంద్ర సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తున్నారు. వ్యాపారుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆహార భద్రత, పరిశుభ్రత అంశాలపై ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నారు. దీనివల్ల వ్యాపార నిర్వహణలో మెరుగైన అవగాహన పెరగడంతో పాటు ఆదాయ వృద్ధికి దోహదపడుతోంది. వ్యాపార కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం లబ్ధిదారుల్లో పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

# నాల్కో పనితీరుపై సమీక్ష..

**అధికారులతో కీలక సమావేశం**

**ఉత్పత్తి సామర్థ్యంపై దృష్టి**

**స్వావలంబన భారత్ లక్ష్యం**

**కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి**

**న్యూఢిల్లీ, జూన్ 1 :**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి జాతీయ అల్యూమినియం సంస్థ నాల్కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంస్థ ప్రస్తుత కార్యకలాపాలు, ఉత్పత్తి లక్ష్యాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో నాల్కో ఉత్పత్తి సామర్థ్యం, గనుల నిర్వహణ, ముడి పదార్థాల లభ్యత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష జరిగింది. దేశ ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా ఖనిజ, లోహ రంగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేయడం, ఖనిజాలు నుంచి తుది ఉత్పత్తుల వరకు విలువ ఆధారిత వ్యవస్థను మరింత బలపరచడం అత్యంత అవసరమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ అవసరాలను తీర్చేందుకు సంస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఖనిజ వనరుల భద్రత, స్థిరమైన అభివృద్ధి, దేశీయ ఉత్పత్తి పెంపు వంటి అంశాల్లో నాల్కో కీలక పాత్ర పోషించాల్సి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సహజ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన స్వావలంబన భారత్, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాల సాధనలో నాల్కో పాత్ర ఎంతో కీలకమని కిషన్ రెడ్డి అన్నారు. దేశీయ పరిశ్రమల బలోపేతం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, ఖనిజ రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో సంస్థ ముందుండాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఉత్పత్తి విస్తరణ, ఆధునిక సాంకేతికత వినియోగం, వనరుల సమర్థ నిర్వహణ ద్వారా నాల్కో దేశ అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషిస్తుందని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ దిశగా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



## అతిశయోక్తులు, అవాస్తవాలు

విశాఖపట్టణంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ నిర్మిస్తున్న ఒక గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఏర్పాటు గురించి నవంబర్ 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన గుత్తా రోహిత్ వ్యాసంలో అనేక అతిశయోక్తులు, అవాస్తవాలు ఉన్నాయి. మొదటగా గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టులో అదానీ, ఎయిర్‌టెల్ కేవలం సహాయకులే (ఎనేబ్లర్లు) కానీ భాగస్వాములు కాదు. డేటా సెంటర్ స్థాపనకు అవసరమైన నిర్మాణాలు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతుల కల్పన అదానీ గ్రూప్ ఏర్పాటు చేస్తే, సముద్ర గర్భ కేబుల్స్, అంతర్జాతీయ డేటా ట్రాన్సిట్, అంతర్జాల సదుపాయాలను ఎయిర్‌టెల్ సమకూరుస్తుంది. నిజానికి యూఎస్‌ఏలోని 50 రాష్ట్రాలలో 5,426 డేటా సెంటర్లు, చైనా, యూరోప్, సింగపూర్ తదితర దేశాలలో వందలాది డేటా సెంటర్లు ఉన్నాయి. భారతదేశంలో ప్రభుత్వ డిజిటల్ ఇండియా కార్యక్రమం, డేటా లోకలైజేషన్ విధానాలు, ఇంటర్నెట్ విస్తరణ, స్మార్ట్‌ఫోన్లు, ఈ%-%కామర్స్, డిజిటల్ సేవల విస్తరణ వల్ల డేటా ఉత్పత్తి పరిమాణం విపరీతంగా పెరిగి డేటా సెంటర్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ డేటాలో భారత్ 20శాతం ఉత్పత్తి చేస్తున్నా, ప్రపంచ డేటా సెంటర్ సామర్థ్యంలో దాని వాటా కేవలం మూడు శాతం మాత్రమే. మన డేటా వేరే దేశాల్లో ఉండకూడదని ఇటీవల ప్రభుత్వం విధించిన నిబంధన వల్ల మన దేశంలో డేటా సెంటర్ల ఏర్పాటు అనివార్యం అయ్యింది. గూగుల్ అమెరికా వెలుపల ఇంత భారీ స్థాయి పెట్టుబడులతో భారతదేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ విశాఖలో ఏర్పాటు చేయడం సామాన్య విషయం కాదు. కేవలం డేటా సెంటర్ ఏర్పాటే కాకుండా సబ్ సీ కేబుల్, కేబుల్ లాండింగ్ స్టేషన్ ఏర్పాట్లపై దృష్టి పెట్టిన గూగుల్, కొత్త గ్లోబల్ సబ్ సీ కేబుల్ వ్యవస్థను విశాఖ డేటా సెంటర్‌తో అనుసంధానించడం ద్వారా విశాఖను గ్లోబల్ కనెక్టివిటీకి గేట్‌వేగా మార్చబోతోంది. ఇందువల్ల ఈ డేటా సెంటర్‌లో ప్రాసెస్ అయిన డేటా మొత్తం సబ్ సీ కేబుల్ ద్వారా నేరుగా సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియాతో సహా మరో 12 దేశాలకు లింక్ అవుతుంది. డేటా సెంటర్లలో విద్యుత్, నీటి వినియోగం అధికంగా ఉంటుందనేది నిజం. అయితే గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమయ్యే నీరు, విద్యుత్ సరఫరా చేయడం వల్ల విశాఖ నగరంపై ప్రభావం పడుతుందనేది పూర్తిగా అపోహే. డేటా సెంటర్ కోసం విశాఖపట్టణం మొత్తానికి రోజుకు అవసరమైన నీటిలో 11శాతం కావాలన్న వ్యాసకర్త అభిప్రాయం సత్యదూరం.

పోలవరం నుంచి ప్రధాన ఎడమ కాలువ ద్వారా 2027 డిసెంబర్ నాటికి 24 టీఎంసీల నీరు విశాఖకు ఇవ్వాలని ప్రభుత్వ సంకల్పం. ఈ దిశలో పోలవరం పనులు వేగంగా జరుగుతుంటే, ఎడమ ప్రధాన కాలువ పనులు రెండు నెలల్లో పూర్తవుతాయి. కాబట్టి డేటా సెంటర్ నిర్మాణం పూర్తయ్యేనాటికి (2028) పోలవరం నీళ్లు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న సంప్రదాయ విధానాల్లో గూగుల్ డేటా సెంటర్ కోసం అత్యధికంగా 0.5 టీఎంసీల నీరు అవసరం అవుతుందని అంచనా. కానీ గూగుల్ ప్రస్తుతం అనుసరిస్తున్న నీటి స్ప్రేయింగ్ విధానాలు కాకుండా అత్యంత సమర్థమైన, ఆధునిక లిక్విడ్ కూలింగ్ సిస్టమ్ వినియోగించడం వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం కూడా 20శాతం తగ్గుతుంది. పోలవరం నుంచి మనం ఇవ్వబోయేది, గూగుల్ వాడుకునేది అర టీఎంసీ కన్నా తక్కువ నీరు మాత్రమే. ఎక్కువ నీరు అవసరమైతే డీశాలినేషన్ విధానం ద్వారా సముద్రపు నీటిని శుద్ధి చేసి వాడుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. కాబట్టి ఏ విధంగా చూసినా నీటి లభ్యత పెద్ద సమస్య కానేకాదు. రాష్ట్రంలో 2025 ఏప్రిల్ నాటికి స్థాపిత విద్యుత్ సామర్థ్యం 18,552.9 మె.వా (పునరుత్పాదక విద్యుత్ 9,419 మె.వా, థర్మల్ విద్యుత్ 7,655.50 మె.వా, జల విద్యుత్ 1,672.60 మె.వా) కాగా 2030 నాటికి 31,000 మె.వాట్లకు చేరుతాం. కాబట్టి డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా చేయడం సమస్య కాదు. అయితే గూగుల్ "మా డేటా సెంటర్ నిర్వహణకు కావలసిన విద్యుత్ అదానీ నిర్మించబోతున్న సొంత సౌరశక్తి ప్లాంట్ల ద్వారా తయారు చేసి గ్రిడ్‌కు అనుసంధానించుకుని వాడుకుంటాం, మీ విద్యుత్ అవసరం లేదు" అంటోంది. కాబట్టి రాష్ట్రానికి విద్యుత్ భారం దాదాపు ఉండదు. ఐటీ కంపెనీల కంటే తక్కువ మంది ఉద్యోగులను డేటా సెంటర్లు నియమించుకున్నప్పటికీ సాధారణంగా అధిక వేతనాలు ఇస్తాయి. వర్జీనియా రాష్ట్ర 'జాయింట్ లెజిస్లేటివ్ ఆడిట్, రివ్యూ కమిషన్ రిపోర్ట్' డేటా సెంటర్ పరిశ్రమ వర్జీనియా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వార్షికంగా సుమారు 74,000 ఉద్యోగాలు, 5.5 బిలియన్ డాలర్ల శ్రామిక ఆదాయం, 9.1 బిలియన్ డాలర్ల స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ)ని అందిస్తున్నదని తెలియజేసింది. ఈ ఆర్థిక లాభాలలో చాలా భాగం డేటా సెంటర్ల నిరంతర కార్యకలాపాల కంటే ముందే నిర్మాణ దశ నుంచే వస్తాయి. కాబట్టి డేటా సెంటర్ వల్ల కేవలం వందల ఉద్యోగాలు వస్తాయనే వ్యాసకర్త భావన అసంబద్ధం. విశాఖ గూగుల్ హబ్ అత్యాధునిక ఏఐ మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్ సామర్థ్యం, భారీ స్థాయి ఇంధన వనరులు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌లను ఒకేచోట సమన్వయపరచి విశాఖను కృత్రిమ మేధ పరివర్తన కేంద్రంగా నిలబెడుతుంది. డేటా సెంటర్లు సాధారణ కంప్యూటింగ్ నుంచి ఏఐ, మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) వైపు మారడం వల్ల ఏఐ పరిశోధనలు, నిర్వహణ, అనుభవం ఉన్న టెక్ నిపుణుల అవసరం చాలా ఎక్కువ. ఏఐ ఇంజినీరింగ్, సైబర్ భద్రత, క్లౌడ్ ఆర్కిటెక్చర్, డేటా మానిటరింగ్, జీపీయూ క్లస్టర్ నిర్వహణ, సబ్ సీ కేబుల్ లాండింగ్ స్టేషన్ కూడా ఉండటం వల్ల కేబుల్ నిర్వహణ కోసం కూడా ఉద్యోగుల అవసరం ఉంటుంది. అలాగే ఏఐ ఆధారిత స్టార్టప్స్, పరిశ్రమలకు విశాఖ కేంద్రంగా మారుతుంది. పీఐబీ నివేదిక ప్రకారం గూగుల్ డేటా సెంటర్ వల్ల రాష్ట్రానికి అన్ని పన్నులు, ఇతరత్రా కలుపుకుని ఏటా రూ.10,588 కోట్ల ఆదాయం వస్తుంది. అంటే రాష్ట్ర ప్రస్తుత ఆదాయాన్ని అనుసరించి రాష్ట్రానికి గూగుల్ 'ఒక నెల' ఆదాయాన్ని ఇవ్వబోతోంది. గూగుల్ రాకతో కృత్రిమ మేధ కేంద్రంగా, ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ పెట్టుబడులకు ముఖద్వారంగా విశాఖ నిస్సందేహంగా అభివృద్ధి చెందుతుంది.

## పగుళ్లతో పరేషాన్!



శీతాకాలంలో వీచే చలిగాలులకు దగ్గు, జలుబు, జ్వరంతోపాటు పిల్లల్లో పెదాలు పొడిబారడం, పెద్దల్లో పాదాలకు పగుళ్లు రావడం లాంటి సమస్యలు తరచుగా కనిపిస్తాయి. కాలి మడమల్లో పగుళ్లు సాధారణమే అయినా నివారణ చర్యలు తీసుకోకపోతే సమస్య తీవ్రమవుతుంది. సహజంగానే పాదాల చర్మంలో నూనె గ్రంథులు తకువగా ఉంటాయి. శీతాకాలంలో ఈ నూనెలు మరింత తగ్గడంతో మడమల దగ్గర పగుళ్లు ఏర్పడతాయి. వయసు పెరిగే కొద్దీ చర్మం దాని స్థితిస్థాపకతను కోల్పోతుంది. సహజ నూనెల ఉత్పత్తి సైతం తగ్గుతుంది. దీనివల్ల పెద్దవాళ్లలో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది. మరోవైపు వాతావరణం చల్లగా ఉండటం, తగినంత నీరు తాగకపోవడం మూలంగా శరీరంలో తేమ లోపించి మడమల పగుళ్లకు దారి తీస్తుంది. మడమలు పగిలిన భాగంలో చర్మం పొకులు పొకులుగా లేచి రాత్రి పూట పడుకున్నప్పుడు బెడ్ షీట్ తగిలినా నొప్పిలేస్తుంది. మట్టిలో తిరిగే వారికి బాధ మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ పగుళ్ల సమస్యతో మహిళలే ఎకువగా ఇబ్బంది పడుతుంటారు. వీటి నుంచి మీ పాదాలు రక్షించుకోవడానికి రోజూ పాదాలను గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వాతావరణంతో సంబంధం లేకుండా సరిపడా నీళ్లు తాగాలి. దీనివల్ల చర్మం పొడిబారకుండా ఉంటుంది. రోజుకు రెండుసార్లు పాదాలకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. వృద్ధులు, మధుమేహ బాధితులు రాత్రిపూట సాక్స్‌లు ధరించడం వల్ల చలిగాలి నుంచి తప్పించుకోవచ్చు. వేడి నీటితో కాకుండా గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం ఉత్తమం. ఆహారంలో ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు ఉండే విత్తనాలు, గింజలు, విటమిన్ సి కలిగిన పండ్లు తీసుకుంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉంటే పగుళ్లు మాయం అవుతాయి.

# అమరవీరుల కలల తెలంగాణ ఇదేనా..?

**పదేళ్లు బీఆర్ఎస్ పాలన... నెరవేరని హామీలు, పెరిగిన నిరాశలు..!**
**కాంగ్రెస్ రెండేళ్ల పాలన... ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఎప్పుడు..?**



పార్వతి రాజేష్ కుమార్
సీనియర్ జర్నలిస్ట్

జూన్ 2... తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం. కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, వేలాది మంది ఉద్యమకారుల పోరాటాలు, అమరవీరుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వరాష్ట్రం తెలంగాణ. అయితే రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు పూర్తవుతున్న ఈ సందర్భంలో ప్రతి ఇంటి నుంచి, ప్రతి గడప నుంచి ఒకే ప్రశ్న వినిపిస్తోంది...

**"తెలంగాణ వచ్చింది...**
**మరి తెలంగాణ ప్రజల కలలు నెరవేరాయా..?"**

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో నీళ్లు – నిధులు – నియామకాలు ప్రధాన నినాదాలుగా నిలిచాయి. ఉద్యోగాల కోసం యువత పోరాడింది. రైతు బతుకు మారుతుందనే ఆశతో గ్రామాలు ఎదురుచూశాయి. దళితులు, బడుగు బలహీన వర్గాలు సామాజిక న్యాయం కోసం తెలంగాణను కోరుకున్నాయి. కానీ ఉద్యమం ముగిసి పాలన ప్రారంభమైన తర్వాత ఆశయాలు ఒకవైపు, ఆచరణ మరోవైపు నడిచాయనే విమర్శలు నేటికీ వినిపిస్తూనే ఉన్నాయి. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేసింది. తెలంగాణ దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారిందని చెప్పుకుంది. కానీ మరోవైపు నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం రోడ్లపైకి రావాల్సి వచ్చింది. పరీక్షా పత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాలలో జాప్యాలు, రైతుల అప్పులు, పెరుగుతున్న అవినీతి ఆరోపణలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీశాయి. ఉద్యమ సమయంలో ఇచ్చిన అనేక హామీలు అమలుకాకపోవడం బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో ప్రశ్నలు మిగిల్చింది. ఆ అసంతృప్తే మార్పు కోసం కాంగ్రెస్‌కు అవకాశమిచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటివరకు ప్రజల అంచనాలను పూర్తిస్థాయిలో అందుకోలేకపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో జాప్యం, రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం లేకపోవడం, నిరుద్యోగ యువతకు స్పష్టమైన భరోసా కనిపించకపోవడం వంటి అంశాలపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. రాష్ట్రం ఏర్పడింది... కానీ రైతు ఆత్మహత్యలు పూర్తిగా ఆగలేదు. యువత వలసలు తగ్గలేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలు పోలేదు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి అనేక ప్రాంతాల్లో ఇంకా మెరుగుపడలేదు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సమస్యలు ఇప్పటికీ ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రతి ఆవిర్భావ దినోత్సవం రోజూ పాలకులు విజయాల జాబితా చదువుతారు. ప్రతిపక్షాలు వైఫల్యాల చిట్టా బయటపెడతాయి. కానీ సామాన్య ప్రజల మనసులో మాత్రం ఒకటే ప్రశ్న మిగులుతోంది...

**"ఉద్యమ సమయంలో చెప్పిన బంగారు తెలంగాణ ఎక్కడ..?"**

తెలంగాణ ఉద్యమం కేవలం భౌగోళిక విభజన కోసం జరిగిన పోరాటం కాదు. అది స్వాభిమానం కోసం... స్వయంపాలన కోసం... సామాజిక న్యాయం కోసం... ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు కోసం సాగిన ఉద్యమం. ఆ ఆశయాలు పూర్తిస్థాయిలో నెరవేరే వరకు తెలంగాణ ఉద్యమం ముగియలేదనే భావన ప్రజల్లో ఇంకా బలంగానే ఉంది. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంబరాలు చేసుకోవడం అవసరమే. కానీ అదే సమయంలో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి కలల తెలంగాణ ఎంతవరకు సాకారమైందో పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం కూడా ఇదే. రాష్ట్రం ఏర్పడటం చరిత్ర. ప్రజల జీవితాలు మారడం మాత్రమే అసలైన విజయం.

# కిరికిరి స్వామిగా మారిన రామస్వామి..?

**వివాదాస్పద భూముల లావాదేవీలే స్వామి లక్ష్యం**
**స్వామి పేరు వినబడితే తలలు పట్టుకుంటున్న బాధితులు**
**భూమి లేని పత్రాలతో నే స్వామి రియల్ దందా..**



**మంచిర్యాల, జూన్ 1 (మన సమాజం):**
మంచిర్యాల జిల్లాలో భూములకు సంబంధించిన వివాదాలు కొత్తవి కావు. అయితే ఇటీవల కొన్ని భూ లావాదేవీల నేపథ్యంలో రామస్వామి అనే వ్యక్తి పేరు తరచూ వినిపిస్తుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా వివాదాస్పద భూములకు సంబంధించిన పత్రాల కొనుగోలు, యాజమాన్య హక్కులపై తలెత్తుతున్న అభ్యంతరాలు, సెటిల్మెంట్ ప్రయత్నాలపై వస్తున్న ఆరోపణలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం మందమర్రి మండలం గద్దెరాగడి, తిమ్మాపూర్ ప్రాంతాల్లో వివాదాలకు గురైన భూములకు సంబంధించిన పాత పట్టా పత్రాలు లేదా హక్కులపై స్పష్టత లేని రికార్డులను సేకరించి, అనంతరం వాటి ఆధారంగా అదే సర్వే నంబర్లలో ఉన్న భూములపై హక్కులు కోరే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ ధరలకు పత్రాలను కొనుగోలు చేసి, అనంతరం వాటిని ఆధారంగా చేసుకుని సెటిల్మెంట్లకు దిగుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. కొంతమంది భూ యజమానులు తమ వద్ద ఉన్న పత్రాలను కొనుగోలు చేసే సమయంలో పూర్తి మొత్తాన్ని చెల్లించకుండా, మిగిలిన డబ్బులు తర్వాత ఇస్తామని చెప్పి ఇబ్బందులకు గురి చేశారంటూ ఆరోపిస్తున్నట్లు సమాచారం. మరికొందరు తమ భూములకు సంబంధించిన లావాదేవీల్లో నష్టపోయామని, వివాదాల్లో చిక్కుకుని అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఈ వ్యవహారాలకు సంబంధించిన వివాదాల కారణంగా కొందరు బాధితులు పోలీసు స్టేషన్లు, కోర్టుల మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. పత్రాల కొనుగోళ్ల నేపథ్యంలో ఇతరులకు చెందిన భూములపై హక్కుల వివాదాలు తలెత్తడం, రిజిస్ట్రేషన్లు, చెల్లింపులు, యాజమాన్య హక్కులపై అభ్యంతరాలు వ్యక్తమవడం వంటి అంశాలు స్థానికంగా చర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో కొందరు బాధితులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారాలపై ఆరోపణలు చేస్తున్న వారి వాదనలు ఒకవైపు ఉండగా, మరోవైపు రామస్వామి స్పందన, అధికారిక రికార్డులు, విచారణ ఫలితాలు కూడా వెలుగులోకి రావాల్సి ఉంది. ఆరోపణల్లో ఎంతవరకు నిజం ఉంది, సంబంధిత అధికారుల విచారణలో ఏమి తేలనుంది అనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో భూ వివాదాలకు సంబంధించిన చర్చల్లో ఈ అంశం ప్రధానంగా వినిపిస్తుండగా, అధికారిక విచారణలు, న్యాయపరమైన ప్రక్రియల ద్వారానే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# చరిత్రను విస్మరించిన వందేమాతరం వివాదం!

భారత స్వాతంత్ర్యోద్యమ చారిత్రక చిహ్నమైన బంకించంద్ర ఛటర్జీ 'వందేమాతరం' గీతం విరచితమై 150 సంవత్సరాలైన సందర్భంగా కొనసాగుతున్న వివాదం నిరర్థకమైనది. చరిత్రను విస్మరించి వ్యాఖ్యలు చేయడం సరికాదు. 1937లో జరిగిన ఎన్నికలలో భారత జాతీయ కాంగ్రెస్ విజయం సాధించి వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల నేర్పాటు చేసింది. అయితే బెంగాల్‌లో ముస్లిం లీగ్ నాయకుడు ఎ.కె.ఫజ్లుల్ హక్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వంలో చేర్చుకునేందుకు ఫజ్లుల్ హక్ సుముఖత చూపినా అందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. కాంగ్రేసేతర ప్రభుత్వం నెలకొనడంతో బెంగాల్‌లో హిందూ-ముస్లిం వర్గాల మధ్య రాజకీయం గానూ, సామాజికంగానూ విభేదాలు తీవ్రమయ్యాయి. జాతిని దైవిక మాతృమూర్తిగా వ్యక్తీకరించిన వందేమాతరం గీతంలోని హిందూ ప్రతీకవాదం, దుర్గామాత ప్రస్తుతికి వ్యతిరేకంగా ముస్లిం నాయకులు ఆందోళన చేస్తున్న రోజులవి. వందేమాతరంను జాతీయగీతంగా స్వీకరించకూడదనేది ముస్లింల డిమాండ్. దేశవ్యాప్తంగా మత సామరస్యాన్ని దెబ్బతీసే అవకాశమున్నందున ఈ వివాదంలో జోక్యం చేసుకోవడం జాతీయ కాంగ్రెస్ కేంద్ర నాయకత్వానికి అనివార్యమయింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సంప్రదిం చింది. వందేమాతరం గీతంలోని మొదటి రెండు చరణాలను జాతీయగీతంగా ఆలపించవచ్చని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ విశ్వసించే అహింసా సిద్ధాంతం, లౌకికవాద విలువలకు వందేమాతరం గీతం పూర్తిగా విరుద్ధమైనందున **National Anthem** గా స్వీకరించేందుకు అది యోగ్యమైనది కాదని కృష్ణ కృపలానీ అక్టోబర్ 1937 'విశ్వభారతి న్యూస్'లో రాసిన ఒక వ్యాసంలో వాదించారు. 1896లోనే వందేమాతరం గీతానికి స్వరరచన చేసిన రవీంద్రుడు తన 70వ జన్మదిన వేడుకల సందర్భంగా ఆ గీతంపై ఆలోచనాత్మక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. '

# బ్లూటూత్ పేరుతో కలకలం

**- విమానంలో భద్రతా ఆందోళన - ఎమర్జెన్సీగా యూటర్న్ - సురక్షితంగా ల్యాండింగ్**



**న్యూజెర్సీ, జూన్ 1**

ఒక బ్లూటూత్ పరికరానికి పెట్టిన పేరు అంతర్జాతీయ విమానంలో తీవ్ర కలకలం రేపింది. భద్రతా పరమైన అనుమానాలు తలెత్తడంతో విమాన సిబ్బంది ఎమర్జెన్సీ ప్రకటించి, ప్రయాణాన్ని మధ్యలోనే నిలిపివేసి విమానాన్ని తిరిగి బయల్దేరిన విమానాశ్రయానికే మళ్లించారు. ఈ ఘటన అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో వెలుగుచూసింది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ విమానం 190 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో నెవార్క్ విమానాశ్రయం నుంచి స్పెయిన్‌కు బయల్దేరింది. ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే విమాన సిబ్బంది బ్లూటూత్ పరికరాల జాబితాను పరిశీలిస్తున్న సమయంలో ఒక డివైజ్ పేరు అనుమానాస్పదంగా కనిపించింది. ఆ పరికరానికి "బాంబ్" అనే పేరు ఉండటాన్ని గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. విమానంలో ఉన్న ప్రయాణికులందరూ తమ మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లోని బ్లూటూత్ సదుపాయాన్ని నిలిపివేయాలని పలుమార్లు ప్రకటించారు. అయితే అందరూ సూచనలు పాటించినప్పటికీ ఆ పేరుతో ఉన్న పరికరం మాత్రం నిరంతరం యాక్టివ్‌గా కనిపించింది.దాదాపు రెండు గంటలపాటు పరిస్థితిని గమనించిన సిబ్బంది భద్రతా నిబంధనలను దృష్టిలో ఉంచుకుని గ్రౌండ్ కంట్రోల్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఎలాంటి ప్రమాదాన్ని ముందుగానే నివారించాలనే ఉద్దేశంతో ఎమర్జెన్సీ ప్రకటించి విమానాన్ని వెనక్కి మళ్లించాలని నిర్ణయించారు. దీంతో విమానం తిరిగి నెవార్క్ విమానాశ్రయానికి చేరుకుని సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం భద్రతా సిబ్బంది విమానం, ప్రయాణికుల సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదకర వస్తువు లభించలేదని విదేశీ మీడియా కథనాలు పేర్కొన్నాయి. శనివారం జరిగిన ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన పోస్టుల ద్వారా వెలుగులోకి వచ్చింది. ఒక బ్లూటూత్ పరికరానికి సరదాగా పెట్టిన పేరు కూడా విమాన భద్రతా వ్యవస్థను ఎంతగానో ప్రభావితం చేయగలదని ఈ సంఘటన మరోసారి స్పష్టం చేసింది. విమాన ప్రయాణాల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వడం వల్లే అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారని నిపుణులు పేర్కొంటున్నారు.

# ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

- **కొత్తగూడలో సీఎం సందేశం**
- **పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి**
- **లక్ష ఇళ్ల గృహప్రవేశాలకు శ్రీకారం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 1**

ఆదివాసీ కుటుంబాల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలంటే పిల్లలను తప్పనిసరిగా చదివించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కొరారి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలోని సిడం కన్నీబాయి, టెకం పగ్గుబాయి, ఆత్రం పోచుబాయిల కొత్త ఇళ్లను కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించి గృహప్రవేశాలు నిర్వహించారు. నూతన సాంకేతికతతో నిర్మించిన ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ మహిళలతో జరిగిన ముఖాముఖి సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి వంటి సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. అయితే ప్రతిఫలంగా తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని కోరారు. ఒక పూట ఉపవాసం ఉన్నా సరే పిల్లల చదువును ఆపొద్దని విజ్ఞప్తి చేశారు. చదువే జీవితాలను మార్చగల శక్తి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విద్య ద్వారా మాత్రమే పేదరికం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని, ఆదివాసీ కుటుంబాల భవిష్యత్తు పిల్లల విద్యపైనే ఆధారపడి ఉందని వివరించారు. మహిళల నుంచి పిల్లలను చదివిస్తామని మాట తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండో విడతగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని కూడా కొత్తగూడ నుంచే ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. గూడాలు, తండాలు, ఐటీడీఏ ప్రాంతాల్లో నివసించే ప్రతి అర్హ కుటుంబానికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో గుడిసెలు లేని తెలంగాణను నిర్మించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు మధ్యలో ఆపకుండా పూర్తి చేయాలని సూచించిన ముఖ్యమంత్రి, మహిళా సంఘాలకు అందించే రుణ పరిమితిని పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, వివేక్ వెంకటస్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ అధికారంలోకి రాదు..

- **మఖ్దూం భవన్‌లో కౌన్సిల్ సమావేశం**
- **ప్రజా సమస్యలపై పోరాటాలకు పిలుపు**
- **ఎన్నికలకు పార్టీ సన్నద్ధం**
- **సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**హైదరాబాద్, జూన్ 1**

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మతపరమైన విభజన రాజకీయాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. మతాన్ని ఆధారంగా చేసుకుని రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందంటూ ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని కూనంనేని అన్నారు. అయితే రాష్ట్రంలో కొన్ని స్థానాలు గెలిచే అవకాశం ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ప్రజలు ప్రస్తుతం అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దేశవ్యాప్తంగా ప్రభుత్వాలపై అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రత్యామ్నాయ రాజకీయాలకు బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి పార్టీ వ్యూహాన్ని కూడా ఆయన వివరించారు. పొత్తులు కుదిరితే కనీసం ఐదు స్థానాల్లో, పొత్తులు లేకపోతే కనీసం పదిహేను నియోజకవర్గాల్లో పోటీ చేసేలా పార్టీ సిద్ధం కావాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బలమైన నలభై నియోజకవర్గాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ నియోజకవర్గాల్లో ఆగస్టు 6 నుంచి 15 వరకు ప్రత్యేక పాదయాత్రలు నిర్వహించనున్నట్లు కూనంనేని ప్రకటించారు. ఈ యాత్రల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తామని చెప్పారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలాగే ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై జరుగుతున్న వేధింపులకు నిరసనగా జూన్ 4న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ అంశంపై జూన్ 15న రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. సెప్టెంబర్ 28న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావిస్తామని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం



**న్యూఢిల్లీ, జూన్ 1**

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. ఢిల్లీలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతుల ప్రయోజనాలను విస్మరించిందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని అన్నారు.ఎన్నికల సమయంలో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని రాంచందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైనే ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. దిగుబడులకు సంబంధించిన సరైన గణాంకాలను కేంద్రానికి పంపడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రాలు సేకరించిన ధాన్యానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం నిధులు తిరిగి చెల్లిస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంపై బీజేపీ ఇప్పటికే పలు ఆందోళనలు నిర్వహించిందని రాంచందర్ రావు గుర్తుచేశారు. బీజేపీ నిరంతర పోరాటాలు, నిరసనల కారణంగానే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాల్సి వచ్చిందని అన్నారు. ప్రతిపక్ష ఒత్తిడి వల్లే ప్రభుత్వం స్పందించిందని వ్యాఖ్యానించారు.రైతుల వద్ద మిగిలి ఉన్న ప్రతి ధాన్యం గింజను ఎలాంటి జాప్యం లేకుండా యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కొనుగోలు, రవాణా, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జూన్ 2న ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాంచందర్ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ నాయకత్వంతో పాటు పలువురు కేంద్ర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

## జనసేన సభకు అనుమతి నిరాకరణ



**హైదరాబాద్, జూన్ 1**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన "తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభ -- జనసేన సాధక్ సమ్మేళనం"కు తెలంగాణ పోలీసులు అనుమతి నిరాకరించారు. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో జూన్ 2న ఈ సభను నిర్వహించాలని జనసేన పార్టీ ప్రణాళిక రూపొందించినప్పటికీ, శాంతిభద్రతల కారణాలను చూపుతూ పోలీసులు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో అధికారిక వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో భద్రతా బలగాలన్నీ ఆ విధుల్లో నిమగ్నమై ఉంటాయని పోలీసులు తెలిపారు. అదే రోజు రాజకీయ సభ నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్యలతో పాటు శాంతిభద్రతల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో సభ నిర్వహణకు అనుమతి నిరాకరిస్తూ సంబంధిత అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలకు భద్రత కల్పించడం ప్రస్తుతం ప్రధాన ప్రాధాన్య అంశమని పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. పోలీసుల నిర్ణయంపై జనసేన పార్టీ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. సభ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పార్టీ తరఫున తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సభ నిర్వహణ తమ ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొంటూ అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరినట్లు తెలిసింది.ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. కొందరు రాజకీయ నాయకులు సభ నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, తెలంగాణలో పార్టీ విస్తరణలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని జనసేన వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో పార్టీ కార్యకర్తలను సమీకరించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయడమే లక్ష్యమని పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉండటంతో హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కోర్టు తీర్పు అనంతరం సభ నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



## అతని వల్లే డ్యాన్స్‌లో పర్‌ఫెక్షన్!

ఇరవైఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో హిట్ చిత్రాల్లో భాగమైంది అగ్ర కథానాయిక తమన్నా. హీరోయిన్‌గా రాణిస్తూనే మరోవైపు ప్రత్యేక గీతాల ద్వారా యూత్‌లో క్రేజ్ దక్కించుకుంది. ఇటీవలకాలంలో 'స్త్రీ-2' చిత్రంలో 'ఆజ్ కీ రాత్..' పాట బాగా పాపులర్ అయింది. తమన్నా నటించిన 'డూ యూ వాన్నా పార్ట్‌నర్' అనే వెబ్‌సిరీస్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో డ్యాన్స్‌లో తన ప్రతిభకు కారణం అల్లు అర్జున్ అని వెల్లడించింది. "బద్రీనాథ్' టైంలో డ్యాన్స్ విషయంలో బన్నీ బాగా ఎంకరేజ్ చేశారు. మంచి పర్‌ఫెక్షన్‌తో డ్యాన్స్ ఎలా చేయాలో అతని నుంచి నేర్చుకున్నా. ఆ సినిమా తర్వాత నాకు డ్యాన్స్ పరంగా చాలా ఆఫర్లొచ్చాయి. స్పెషల్ సాంగ్స్‌తో కూడా పాపులర్ అయ్యాను' అని చెప్పింది తమన్నా. ఈ ఏడాది 'ఓదెల-2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది తమన్నా. ప్రస్తుతం ఈ భామ హిందీలో నాలుగు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



## మీనాక్షి చౌదరి ట్రావెల్ డైరీ స్పెషల్..

ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది హర్యానా సుందరి మీనాక్షి చౌదరి. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాలతో హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. గతేడాది మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన లక్కీ భాస్కర్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఎప్పుడూ ఏదో ఒక ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో ఫుల్ బిజీగా ఉండే ఈ భామ కాస్త బ్రేక్ తీసుకొని వెకేషన్ టూర్ ప్లాన్ చేసుకుంది. ఇంతకీ మీనాక్షి చౌదరి ఎక్కడికెళ్లిందనుకుంటున్నారా..? ఈ భామ జపాన్ దేశానికి టూర్ వేసింది. స్టైలిష్ డ్రెస్‌లో ఉన్న మీనాక్షి జపాన్ వీధుల్లో వర్షం పడుతుంటే గొడుగు పట్టుకొని మాన్‌సూన్ అందాలను ఆస్వాదించింది. ఈ ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి మరి. ఓ వైపు ఛమక్కుమని మెరుస్తున్న చెవిపోగులు, మరోవైపు సాధారణ పోనీటైల్ లాంటి జుట్టుతో ఉన్న ఈ చిన్నది అందమైన చిరునవ్వుతో అందరినీ ఆకర్షిస్తోంది. ప్రతీ వీధిలో మీనాక్షి చౌదరి దిగిన ఫొటోలు జపాన్ టూర్‌ను ఎలా ఎంజాయ్ చేసిందో చెప్పకనే చెబుతున్నాయి. జపాన్ వెకేషన్‌లోని ప్రతీ ఫ్రేమ్ తన ట్రావెల్ డైరీలో ప్రత్యేకంగా నిలిచిపోయేలా కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. 'కొన్ని యాదృచ్ఛిక విషయాలు, సంఘటనలు మనలో శాశ్వత ముద్ర వేస్తాయి. ఈ అద్భుతమైన రోజు నుండి నాకు అలాంటి ఒక జ్ఞాపకం లభించినందుకు నేను కృతజ్ఞురాలినని భావిస్తున్నాను. జపాన్‌లో మేము ఒక అందమైన కేఫ్‌ను గుర్తించాం. అద్భుతమైన వర్షాభావ దృశ్యాల నుండి అక్కడి అందమైన మనుషులతో అందంగా తయారు చేసిన జపనీస్ టీ వరకు అన్నీ ఆస్వాదించాం' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో క్యాప్షన్ పెట్టింది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న మీనాక్షి చౌదరి. ప్రస్తుతం అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తోంది.

## రెండు వేలకు మించి ఖర్చుపెట్టను!

అరంగ్రేటం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం హిందీ,



తెలుగు భాషల్లో ఈ భామ భారీ చిత్రాల్లో నటిస్తున్నది. అల్లు అర్జున్-అట్లీ కాంబో చిత్రంలో ఈ సొగసరి ఓ కథానాయికగా నటిస్తున్నట్లు వార్తలొస్తున్నా యి. వరుస భారీ సినిమాలతో ఆర్థికంగా కోరుకున్న స్థాయికి చేరుకున్నప్పటికీ..ఖర్చు విషయంలో మాత్రం పొదుపు పాటిస్తుందట ఈ అమ్మడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా డబ్బుపై నియంత్రణ ఉండాలంటూ మృణాల్ చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. 'నాకు ఖరీదైన దుస్తులు కొనడం అస్సలు ఇష్టం ఉండదు. వాటి కోసం ఎంతో ఖర్చుపెడతాం. ఏదో ఒక సందర్భంలో ధరించడం తప్ప అవి ఎక్కువ సమయం బీరువాల్లోనే ఉండిపోతాయి. అందుకే దుస్తుల విషయంలో రెండుమూడు వేలకంటే ఎక్కువగా ఖర్చు చేయను. ఫిల్మ్ ఈవెంట్స్‌కు మాత్రం కాస్త ఖరీదైన డిజైనర్ క్లాత్స్ ధరిస్తాను. అయితే వాటిని అద్దెకు తెచ్చుకుంటాను. అంత డబ్బులు పెట్టి ఎప్పుడూ బట్టలు కొనను' అని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్.

## అదే సక్సెస్ అనుకున్నా.. టార్గెట్ పెట్టుకున్నా.. కానీ

దాదాపు మూడేళ్లగా మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నారు సమంత చికిత్స తీసుకుంటూనే ఇటు సినిమాలు, అటు ప్రొడక్షన్ హౌస్ పనులు చూసుకుంటోంది. అయితే మయోసైటిస్‌తో పోరాటం తనకెన్నో విషయాలు నేర్పిందని చెబుతున్నారామె. ఒకప్పటితో కంపేర్ చేస్తే ఇప్పుడు ఎన్నో విషయాల్లో తనలో మార్పు వచ్చిందన్నారు సామ్. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మయోసైటిస్ వల్ల జీవితంలో దేనికి ఇంపార్టెన్ ఇవ్వాలో అర్థమైంది. దానితో చేసిన ఆ పోరాటం నన్ను ఎంతగానో మార్చేసింది. గతంలో విజయం అంటే గ్యాప్ లేకుండా సినిమాలు చేయడం అనుకునేదాన్ని. ఏడాదిలో నేను నటించిన ఐదు సినిమాలు విడుదలైన సందర్భాలున్నాయి. అదే సక్సెస్ అని నమ్మి మురిసిపోయేదాన్ని. వరుసగా సినిమాలు చేయాలి, పెద్ద బ్లాక్‌బస్టర్స్‌లో నటించాలి. టాప్ 10 నటీనటుల లిస్ట్‌లో ఉండాలి అని భావించేదాన్ని. బుర్రలో ఎప్పుడూ అదే ఆలోచన. కానీ ఇప్పుడు నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. వివరం తెలిసింది. రెండేళ్లుగా నా సినిమాలు విడుదల కాలేదు, టాప్ 10 లిస్ట్‌లోనూ లేను. అలాగే నా దగ్గర రూ.1000 కోట్ల సినిమాలు అంతకన్నా లేవు. అయినా నేను ఇప్పుడు ఉన్నంతలో సంతోషంగానే ఉన్నా' అని అన్నారు. 'ఖుషి' చిత్రం తర్వాత సమంత మరో చిత్రానికి సైన్ చేయలేదు. తన సొంత బ్యానర్‌లో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌లో వచ్చిన 'శుభం' చిత్రంలో గెస్ట్ రోల్ చేశారు. ప్రస్తుతం తన సొంత బ్యానర్‌లోనే 'మా ఇంటి బంగారం' చిత్రం మాత్రమే తన చేతిలో ఉంది. ఆ సినిమా షూటింగ్ అప్‌డేట్ ఏమీ లేదు.

